జూనియర్ కళాశాలను సందర్శించిన డివిఇఒ

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను డివిఇఒ మంజుల వీణ సోమవారం సందర్శించారు. నాడు-నేడు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కళాశాలలో పూర్తయిన మరుగుదొడ్లను, శుద్ధ తాగునీటి ప్లాంటును ప్రారంభించారు. మిగతా పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో, అధ్యాపకులతో సమావేశం నిర్వహించి రానున్న పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కళాశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సాయంత్రం పూట విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న విధానం చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పైల శంకర్రావు, అధ్యాపకులు తేజేశ్వరరావు, గోవిందరావు, ఇంజనీర్ వి.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పిఒ వెలమల అప్పారావు పాల్గొన్నారు.

భగ్గుమన్న అంగన్వాడీలు

నిర్బంధాలపై పలుచోట్ల నిరసనలు

పార్వతీపురంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

కనీస వేతనాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకోవడంపై అంగన్వాడీలు భగ్గుమన్నారు. ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేయించుకుంటూ, సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న పాలకుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సమస్యల పరిష్కారం కోసం శాంతియుత నిరసనకు పిలుపునిస్తే ప్రభుత్వం పోలీసుల ద్వారా అణచివేత చర్యలకు పాల్పడటాన్ని ఖండించారు. నిర్బంధాలు, అరెస్టులకు వ్యతిరేకంగా జిల్లాలో పలుచోట్ల సోమవారం నిరసనలు చేపట్టారు.

ప్రజాశక్తి-పార్వతీపురం

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన పార్వతీపురంలోని సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపించకుండా, ప్రజాస్వామ్యంలో హక్కులను కాలరాస్తూ నిర్బంధించడాన్ని ఖండించారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి చెల్లించాలన్నారు. మినీ సెంటర్లను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అనంతరం యూనియన్ నాయకులు వి.ఇందిర మాట్లాడారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వెంకటరమణ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి మద్దతిచ్చారు. అనంతరం ఐసిడిఎస్ పీడీ విజయగౌరికి వినతి అందించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, యూనియన్ నాయకులు ఎం.గౌరి, వి.ధర్మవతి, దాలమ్మ, సత్యవతి, స్వర్ణ, శైలజ, సావిత్రి, జ్యోతి పాల్గొన్నారు. అంగన్వాడీల అరెస్టులను పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు ఖండించారు.

సాలూరు : ప్రజా ఉద్యమాలను అణచి వేయాలని చూస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు హెచ్చరించారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయ జంక్షన్ నుంచి బోసుబొమ్మ జంక్షన్ వరకు అంగన్వాడీలు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్ళకుండా గృహ నిర్బంధంలో ఉన్న అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సాలూరు అర్బన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు బి.రాధ, పాచిపెంట ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ప్రభావతిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సెక్టార్ నాయకులు శ్యామల, సత్యవతి, రమణమ్మ పాల్గొన్నారు.

పాలకొండ : పాలకొండలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, కోశాధికారి బి.అమరవేణి మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని అనేక పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినా, అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాంతియుతంగా విజయవాడలో మహాధర్నాకు పిలుపునిస్తే అంగన్వాడీ కార్యకర్తలను గృహనిర్బంధాలు, అరెస్టులు చేయడం దారుణమన్నారు. అంగన్వాడీ సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.రాము, నాయకులు ఎం.వీరనాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆర్.భవాని, జి.జెస్సీబాయ్, టి.నిర్మల, ఎన్.మణి, వై.మణి, ధనలక్ష్మి, నాగరాణి, ఇందిర, సీతమ్మ, శ్రీదేవి, కె.శారద, ఎం.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : అంగన్వాడీలపై నిర్బంధాన్ని, అక్రమ అరెస్టులను సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ఖండించారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు.

పాలకొండలో నిరసన, సాలూరులో రాస్తారోకో చేపడుతున్న అంగన్వాడీ కార్యకర్తలు, యూనియన్ నాయకులు

ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ఇఎ ఆధ్వర్యాన ధర్నా

మాట తప్పినందుకు
మూల్యం తప్పదు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఇచ్చిన మాట తప్పిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి తగిన మూల్యం తప్పదని ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ఇఎ నాయకులు హెచ్చరించారు. సోమవారం స్థానిక డిఇఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ఇఎ ఆధ్వర్యాన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మురళీమోహన్‌రావు మాట్లాడుతూ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను తీసుకొస్తానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ మాటతప్పారని, మడుమతిప్పారని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతో ఆదరించి జగన్‌ను గెలిపిస్తే వారిని మోసం చేయడం దారుణమన్నారు. ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని, ఇపుడు ఆర్థిక ఇబ్బందులంటూ తప్పించుకోవడం సిగ్గుచేటని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ వి.ధనుంజయ్‌నాయుడు అన్నారు. అసెంబ్లీలో జిపిఎస్ బిల్లు తీసుకొస్తే ఎమ్మెల్యేలందరికీ తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సిపిఎస్ ముగిసిన అధ్యాయమన్న మంత్రి బొత్స సత్యనారాయణ మాటలను వెనక్కి తీసుకోవాలని, లేకుంటే మంత్రి అధ్యాయమే ముగుస్తుందని జెఎసి ఛైర్మన్ జి.కిశోర్ హెచ్చరించారు. నాయకులు సంతోష్ కుమార్, ఎన్.బాలకృష్ణ, వి.తవిటినాయుడు మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను తీసుకురాకుంటే, భవిష్యత్తులో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. వీరి ఆందోళనకు పింఛనుదారుల సంఘం నాయకులు గణపతి మద్దతిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సత్యనారాయణ, అనిల్, సింహాచలం, రమేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ డిసిగా అప్పారావు

ప్రజాశక్తి-పార్వతీపురం

వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారిగా కొయ్యాన అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాలో ఆరోగ్య శ్రీ కింద ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిపుణులైన వైద్యుల భాగస్వామ్యాన్ని సమన్వయం చేయాలన్నారు. కొయ్యాన అప్పారావు శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పలు హోదాల్లో సేవలు అందించారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో సమర్థవంతంగా వైద్య సేవలు అందించడం, సమన్వయపరచడంలో ప్రముఖ పాత్ర పోషించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆరోగ్యశ్రీ డిసి అప్పారావు

రాష్ట్రంలో గిరిజన వ్యతిరేక ప్రభుత్వం

టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు దారూ నాయక్

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలో గిరిజన వ్యతిరేక ప్రభుత్వం నడుస్తోందని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.దారూ నాయక్ అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలో రాజన్నదొర రాజ్యాంగం నడుస్తోందా, రాజారెడ్డి రాజ్యాంగం కొనసాగుతోందా? అని ప్రశ్నించారు. ఈ నెల 6న రాష్ట్రంలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై పత్రికా ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. దీనిపై డిప్యూటీ సిఎం రాజన్నదొర నుంచి కనీస స్పందన లేదని చెప్పారు. ఒంగోలులో నవీన్ అనే గిరిజన యువకుడిపై మూత్రం పోస్తే సంబంధించిన పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయలేదన్నారు. గిరిజనులపై దాడులు యథేచ్ఛగా జరుగుతున్నాయని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులకు సంబంధించి 16 సంక్షేమ పథకాలను రద్దు చేసిందని ఆరోపించారు. దీని వల్ల 17 వేల మంది గిరిజనులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లేక గంజాయి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర నియోజకవర్గంలో కూడా అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు. గిరిజనులకు జరిగిన అన్యాయం పై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం దారుణమన్నారు. తన ఇంటికి పోలీసులను పంపించి మానసికంగా వేధించారని చెప్పారు.

దారూ నాయక్‌కి స్టేషన్ బెయిల్

డిప్యూటీ సిఎం రాజన్నదొరపై అవినీతి ఆరోపణలు చేసిన టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు దారూ నాయక్‌పై కేసు నమోదు చేసిన నేపథ్యంలో సోమవారం ఆయన రూరల్ పోలీస్ స్టేషన్‌కి హాజరయ్యారు. కొద్దిరోజుల క్రితం ఆయనకు గుంటూరు పోలీసుల ద్వారా నోటీసు జారీ చేశారు. ఈ నేపద్యంలో హాజరైన దారూ నాయక్‌కి స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు.

కేకు కట్ చేస్తున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివారావు

రూ.52 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు

రూ.1000 కోట్లతో ఇంటింటికీ తాగునీరు : జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో రూ.52కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం సిఇఒ కె.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఛైర్మన్ శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. జిల్లా పరిషత్ నుంచి సుమారు రూ.51.74 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తాగునీరు, రహదారుల నిర్మాణానికి అత్యధికంగా నిధులు వెచ్చించామన్నారు. ఉపాధి నిధులను సక్రమంగా, సకాలంలో వినియోగించుకొని, ప్రాధాన్యత పనులు పూర్తి చేశామన్నారు.

జలజీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.వెయ్యి కోట్లతో ఉమ్మడి జిల్లాలో దశలవారీగా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, దీనిలో భాగంగా ఇప్పటివరకు సుమారు రూ.వంట కోట్లు వరకు ఖర్చు చేశామని చెప్పారు. అక్టోబరు నాటికి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 46 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలను కల్పించామన్నారు.

వినతులకు సత్వర పరిష్కారం

అర్జీదారుల సంతృప్తిస్థాయి పెంచాలి : కలెక్టర్ నిశాంత్

ప్రజాశక్తి-పార్వతీపురం

జగనన్నకి చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన వినతులను సత్వరమే పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. వచ్చిన వినతులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని శాఖల వారిగా సత్వరమే పరిష్కరించి, అర్జీదారుల సంతృప్తిస్తాయి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో 187 దరఖాస్తులు అందగా, అధికంగా భూసమస్యలు పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. వినతుల్లో కొన్ని....

- సాలూరు మండలం దళాయివలస గ్రామం నుండి ముప్పల కామయ్య, ముప్పల అప్పారావు, ముప్పల బంగురు రైతులు వ్యవసాయం బోర్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.
- పాలకొండ మండలం పణుకువలసకు చెందిన వారణాసి మల్లికొండ, తదితరులు సర్వే నంబరు 2-13లో 1.30 ఎకరాలను సాగుచేస్తున్నామని, తమ భూమికి ఆక్రమణదారుల నుండి రక్షణ కల్పించాలని కోరారు.
- మక్కువ మండలం శంబరకు చెందిన జోడ తిరుపతి పింఛను మంజూరు చేయాలని విన్నవించారు.
- సాలూరు మండలం మావుడి గ్రామస్తులు 3 నెలలు నుండి వర్షాకాలం ప్రభావం వల్ల రోడ్డు అస్తవ్యస్తంగా తయారైందని, వెంటనే మరమ్మతులు చేయాలని అర్జీ అందచేశారు.

కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిఎంహెచ్ఒ బి.జగన్నాథరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డిపిఒ బి.సత్యనారాయణ, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, సివిల్ సప్లై డిఎం నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, జిల్లా ఉద్యానఅధికారి కె.వి.ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. విజయ గౌరి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్

ఐటిడిఎ స్పందన వినతుల వెల్లువ

వినతులు స్వీకరిస్తున్న పిఒ కల్పనకుమారి

సీతంపేట : ఐటిడిఎలో పిఒ కల్పనకుమారి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నడసంద్ర గ్రామానికి చెందిన మోహిని పాత్ర ఎఎన్ఎం పోస్టు ఇప్పించాలని వినతి అందించారు. లంగడుగూడకు చెందిన సవర కూర్మారావు కుట్టుమిషన్ ఇప్పించాలని కోరారు. జక్కరవీధికి చెందిన ధర్మరాజు తాగునీటి సమస్య పరిష్కరించాలని విన్నవించారు. ముకుందపురానికి చెందిన రమేష్ సాగు పట్టా ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఎపిఒ రోషిరెడ్డి, డిడి మంగవేణి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ సింహాచలం, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, సిడిపిఒ రంగలక్ష్మి, పిహెచ్ఒ గణేష్, పిఎఒ హరికృష్ణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.తులసి మాట్లాడుతూ రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలు విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పోతున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనాలు అమలు చేసి, ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని కోరారు. జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి మాట్లాడుతూ మెనూ ఛార్జీలు ప్రతి విద్యార్థికి రూ.20 ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించి, ప్రమాదాలకు గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వంటమ్మలకు గుర్తింపు కార్డులు ఇచ్చి సామగ్రి సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఉష, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, బి.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

బస్సులో ప్రయాణిస్తూ శ్వాస వదిలి..

గుండెపోటుతో అటవీశాఖ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-సాలూరు, పార్వతీపురంరూరల్

అటవీశాఖలో కురుపాం రేంజ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.శివశంకర్(59) అకస్మాత్తుగా గుండెపోటుకు గురై ప్రాణాలు వదిలారు. ఆయన సోమవారం ఉదయం సాలూరు నుంచి పార్వతీపురం వెళ్లే బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో కూర్చున్న సీటులోనే ప్రాణాలు వదిలారు. పార్వతీపురం సమీపిస్తున్న తరుణంలో బస్సు కండక్టర్ ఆయనను చూసి లేపగా అపస్మారక స్థితిలో ఉండడంతో 108 వాహనానికి ఫోన్ చేశారు. సిబ్బంది ఆయనను పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన ఎక్కువ కాలం సాలూరు అటవీ రేంజ్ కార్యాలయంలో పని చేశారు. ఇటీవల కురుపాం రేంజ్ కార్యాలయం నుంచి డెప్యుటేషన్‌పై ఇక్కడ కొన్నాళ్లు పనిచేశారు. డెప్యుటేషన్ రద్దు కావడంతో కురుపాం నుంచి ఇక్కడికి తిరుగుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి స్థానిక అటవీ రేంజ్ అధికారి కె.రామారావు, కురుపాం రేంజ్ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.

బస్సు సీట్లోనే మరణించిన శివ

రామినాయుడువలస సమీపంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

రామినాయుడువలస సమీపంలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో రామినాయుడువలస, కనపదొరవలస గ్రామాల మధ్య సోమవారం సాయంత్రం ఏడు ఏనుగుల గుంపు సంచరిస్తోంది. సమీప పంట పొలాలను, చెరుకు తోటలను నాశనం చేస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తమ ప్రాంతం నుండి ఏనుగులను దూర ప్రాంతాలకు తరలించి, పంటలను, తమ ప్రాణాలను కాపాడాలని కోరారు.

ఖాళీలు భర్తీ చేయాలని డివైఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను రద్దుచేయాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీపోస్టులు భర్తీ చేయకపోవడంతో లక్షలాది మంది యువత ఉద్యోగ అవకాశాలు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఏటా డిఎస్‌సి తీస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. వెంటనే మెగా డిఎస్‌సికి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే ఎన్నికల్లో యువత తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ధర్నాలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.సతీష్, డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.

148 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలో సత్యసాయి మందిరం ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 148 మందికి శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిస్టు ఎస్.రత్నం కంటి పరీక్షలు చేశారు. 82 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌ఛార్జి సిహెచ్ వెంకటరమణ, ఆలయ నిర్వాహకులు కె.సన్యాసినాయుడు, జి.మురళీకృష్ణ, జి.గౌరీశంకర్, ఎ.కృష్ణబాబు, సిహెచ్ శ్రీనివాసరావు, బడ్డు మాసింగి నవజీవన్ సొసైటీ సభ్యులు పి.హరికృష్ణ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎంఆర్‌సి మెసెంజర్లు

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

ప్రజాశక్తి-గుమ్మ లక్ష్మీపురం

మూడు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని గుమ్మలక్ష్మీపురం ఎంఆర్‌సిలో విధులు నిర్వహిస్తున్న సిఆర్‌ఎంటిలు, ఎల్‌డిఎ, మెసెంజర్లు సోమవారం నిరసన చేపట్టారు. సమగ్ర శిక్షలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఎంటిఎస్, డిఎ, హెచ్‌ఆర్ఎ అమలు చేయాలని వారు కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 11వ పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచాలని కోరారు. అరకొర జీతాలతో అష్టకష్టాలు పడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సామూహిక సెలవులు ప్రకటించారు.

ఉత్సాహంగా కరాటే పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగిన జిల్లా అండర్ 14,17 విభాగాల్లో కరాటే పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, సెట్విజ్ సిఇఒ బి.రాంగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలు పట్ల మక్కువ చూపించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడేందుకు అవకాశాలు వస్తాయన్నారు. చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ,క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మికులను రోడ్డుపైకి నెట్టొద్దు

ప్రజాశక్తి- గరివిడి

డిఎఫ్ఎన్‌లోని ఆక్సైడ్ ప్లాంట్ మూసివేతకు యాజమాన్యం ప్రభుత్వ అనుమతి కోసం లెటర్ ఇవ్వడం దుర్మార్గమని సిఐటియు నాయకులు అన్నారు. కార్మికులను రోడ్డుపైకి నెట్టొద్దని సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు గరివిడి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అంబళ్ల గౌరినాయుడు, జె. విశ్వనాథరాజు మాట్లాడుతూ ఈ ప్లాంట్‌లో పనిచేస్తున్న 110 మంది కార్మికులను తీసివేయాలని యాజమాన్యం ప్రయత్నిస్తుందన్నారు. ప్రభుత్వానికి యాజమాన్యం పెట్టిన మూసివేత దరఖాస్తులను ప్రభుత్వం తిరస్కరించాలని, కార్మికుల కుటుంబాలను రోడ్డున పడకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా అనంతరం గరివిడి బ్రిడ్జి నుంచి తహశీల్దార్ ఆఫీస్ వరకు కార్మికులతో నిరసన ప్రదర్శన చేసి వినతి పత్రాన్ని అందించారు. కార్మికులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రేగిడి

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తహశీల్దార్ బి. సుదర్శన రావు అన్నారు. సోమవారం రేగిడి తహశీల్దారుగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈయన దత్త రాజేరు తహశీల్దారుగా పనిచేసి డిప్యూటేషన్ పై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన తహశీల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి జిల్లా కలెక్టరేట్ సూపరిం టెండెంట్‌గా డిప్యూటేషన్ పై వెళ్ళారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక నగర పంచాయతీలో ఖాళీ వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని 14 వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జరజాపు పేట - 1, 2 సచివాలయం పరిధిలో 5, నెల్లిమర్ల మొయిద జంక్షన్ -1 లో 2, గాంధీ నగర్ కాలనీ, ఇందిరా కాలనీలో 2, అగురు వీధి 5 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. అర్హులైన వారు రిజర్వేషన్ కేటగిరీ బట్టి ఈ నెల 26నుంచి 29లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది హాజరు పట్టిక, జగనన్న ఆరోగ్య సురక్ష సమావేశాల గురించి వివరించారు. పంచాయతీ విస్తరణ అధికారి మాట్లాడుతూ ట్యాక్స్, నాన్ ట్యాక్స్ వివరాలు పంచాయతీ ఆడిటింగ్ వివరాలు, జరగబోయే గ్రామ సభలు గురించి చెప్పారు.ఈ సమావేశంలో మండల రిసోర్స్ కోఆర్డినేటర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెదమేరంగి కూడలి సమీపంలో అధ్వానంగా తయారైన ప్రధాన రహదారి

దమ్ము మడి కాదు.. రోడ్డే!

ఈ చిత్రాన్ని చూశారా? ఇదేదో దమ్ముమడిలో వాహనాలు వెళ్తున్నాయని అనుకుంటున్నారా? లేక ఏదో మారుమూల గ్రామానికి వెళ్లే రహదారి అనుకుంటున్నారా? అలా అనుకుంటే బురదలో కాలేసినట్టే!. జియ్యమ్మవలస మండలం పెదమేరంగి ప్రధాన రహదారి దుస్థితి ఇది. వర్షం పడిందంటే చాలు.. గోతుల్లో నీరు చేరి చెరువును తలపిస్తోంది. ఏడాది కిందట తోటపల్లి ప్రధాన రహదారి నుంచి కురుపాం వరకు రూ.32 కోట్లతో 14 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. నిధులు చాలని కారణంగా పెదమేరంగి, సీమనాయుడు వలస కూడలి, కురుపాంలో రహదారి పనులు చేపట్టలేదు. దీంతో వర్షాల సమయంలో గుంతల్లో నీరు చేరి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. భారీ వాహనాలు వెళ్లే సమయంలో ద్విచక్రవాహనదారులు ఆగి వెళ్లాల్సిందే. లేకుంటే అంతే సంగతి. అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- ప్రజాశక్తి, గుమ్మలక్ష్మీపురం

సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక.. స్పందన

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక స్పందన కార్యక్రమమని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం ఎస్‌పి కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. 9 ఫిర్యాదులు రాగా, అర్జీదారులతో ముఖాముఖి ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదని స్పష్టంచేశారు. బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దిశ డిఎస్‌పి ఎస్.ఆర్.హర్షిత, ఎస్‌బి సిఐ సిహెచ్. లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ ఎన్.వి.ప్రభాకరరావు, ఎస్ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గిరిజనులు

నార్లవలసను రెండు పంచాయతీలుగా చేయాలి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

14 గ్రామాలతో కూడిన నార్లవలస పంచాయతీని రెండు భాగాలుగా విడదీయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి వంతల సుందరరావు మాట్లాడుతూ నార్లవలస పంచాయతీ మండలంలో చాలా పెద్ద విస్తీర్ణంలో ఉందన్నారు. జిల్లేడువలస, మూలవలస, పెద్దవలస, భరిణికివలస, బొర్రా పనుకు, సీతన్నదొరవలస, దబ్బసదును గ్రామాల నుండి పంచాయతీ కార్యాలయానికి వెళ్ళాలంటే సుమారు పది కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. రవాణా సౌకర్యం కూడా లేదని చెప్పారు. పెద్దవలస కేంద్రంగా ఆ గ్రామంలో మరో పంచాయతీని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కూనేటి చినబాబు, కంచూరి రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, నాయకులు తాడంగి కాశీ పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికులకు అంగన్వాడీల మద్దతు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

జీగిరాం జ్యూట్‌మిల్లును తెరిపించాలని 35 రోజులుగా కార్మికులు చేపడుతున్న దీక్షలకు అంగన్వాడీలు మద్దతు తెలిపారు. జ్యూట్ కార్మికుల దీక్షా శిబిరాన్ని సోమవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సందర్శించి, కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు రాజమ్మ, పోలమ్మ, మరియమ్మ, నిర్మల, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, కార్మిక జెఎసి నాయకులు శ్రీనివాసరావు, శంకర్రావు పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికులకు మద్దతు తెలుపుతున్న అంగన్వాడీలు

ఉత్తమ లఘుచిత్రంగా వనమాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

విజయవాడలో ఈ నెల 23, 24న జరిగిన గుర్రం జాషువా 128వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తెలుగు షార్ట్ ఫిలిం అసోసియేషన్ నిర్వహించిన లఘుచిత్ర పోటీలలో ఉత్తమ చిత్రంగా వనమాలి నిలిచింది. మొక్కలు నాటే కార్యక్రమం ఆవశ్యకతపై రూపొందిన ఈ చిత్రానికి కె.గౌరునాయుడు దర్శకత్వం వహించారు. ఆయన కిమ్మి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ లఘు చిత్రాలను చిత్రీకరిస్తున్నారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-సీతంపేట

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా జిల్లాలో ఆ పార్టీ శ్రేణులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు సోమవారం కొనసాగాయి. టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో సంత సెంటర్ వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం, మండంగి ప్రకాశం, బిసి సెల్ అధ్యక్షులు ఆర్.రంగనాథం, ఎస్‌సి సెల్ అధ్యక్షులు గంట సుధా, ఐటిడిపి కోఆర్డినేటర్ హిమరక పవన్, క్లస్టర్ ఇంచార్జ్ నిమ్మక చంద్రశేఖర్, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, బిడ్డిక స్వామినాయుడు, మురళి పాల్గొన్నారు.

కురుపాం.. దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి

కురుపాం : చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కోలేని ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి తెలిపారు. సోమవారం కురుపాంలో టిడిపి కార్యాలయం వద్ద టిఎన్‌ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఆమె సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిఎన్‌ఎస్ఎఫ్ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ సుకేష్ చంద్ర పండా, ప్రతినిధులు కోలా రంజిత్ కుమార్, కలిశెట్టి కొండయ్య, టిడిపి నాయకులు కన్నా, నందివాడ కృష్ణబాబు, మాజీ సర్పంచ్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట చక్కెర ఫ్యాక్టరీ వద్ద టిడిపి ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయ్‌చంద్ర ఆధ్వర్యాన మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. బాబుకు మద్దతుగా పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, నాయకులు ఎస్.హరిబాబు, డి.పెద్దబ్బాయి, శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, వి.గుంపుస్వామి, వి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోటదుర్గ హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక కోటదుర్గ అమ్మవారి హుండీ ఆదాయం రూ.5.44 లక్షలు వచ్చింది. సోమవారం ఆలయ ప్రాంగణంలో తనిఖీ అధికారి కె.వెంకటరమణ, ఇఒ మురళీకృష్ణ ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆగస్ట్ 25 నుంచి మంగళవారం వరకు వచ్చిన ఆదాయంగా అధికారులు చెబుతున్నారు.

జోగంపేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని జోగంపేట గ్రామంలో సర్పంచ్ కళ్లెంపూడి సింహాచలం ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో అన్ని వీధుల్లో జంగిల్ క్లియిరెన్స్ చేపట్టారు. కాలువలో పూడికలు తొలగించారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సారా, మద్యం రవాణాలో పట్టుబడ్డ ఆరు ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాముల సుజన ఫొటోలను కాల్చివేస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

రచ్చకెక్కిన గ్రూపుల గోల

ప్రజాశక్తి -భామిని

నియోజకవర్గంలో ఇన్నాళ్లు నివురుగప్పిన నిప్పులా ఉన్న గ్రూపు రాజకీయాలు రచ్చకెక్కాయి. మండల కేంద్రంలో సోమవారం పాముల సుజన ఫొటోలను వైసిపి నాయకులు, కార్యకర్తలు దగ్ధం చేశారు. ఎమ్మెల్యే వి.కళావతితోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, కొత్తవాళ్లు వచ్చి నియోజకవర్గంలో పార్టీని అప్రతిష్టపాలు చేయొద్దని వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం అన్నారు. నియోజక వర్గంలో చాపకింద నీరులా కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి సోదరి సుజన, మరిది గువ్వల రమేష్‌బాబు... టిడిపి సానుభూతిపరులతో కలిసి వైసిపిని నష్టపరిచేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సిఎం జగన్ హయాంలో ఎమ్మెల్యే కళావతితోనే తామంటా ఉంటామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో జెసిఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచులు ఎస్.రాజు, పాపి నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, పాలక ఉషారాణి, వైసిపి నాయకులు కొత్తకోట ఆంజనేయులు, రొక్కం రమేష్, సంజీవ్‌రావు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- మెంటాడ

స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని పిఎసిఎస్ చైర్మన్ తాడ్డి రామచంద్రరావు అన్నారు. సోమవారం స్థానిక పిఎసిఎస్ భవనంలో ఆయన అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మార్ట్ గేజ్ (తనఖా) రుణాలు రూ.1.33కోట్లు రైతులకు అందజేశామన్నారు. రుణాల రెన్యువల్ రూపంలో రూ.60లక్షలు వసూలు చేశామని చెప్పారు. సొసైటీ పరిసరాల్లో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు నాబార్డ్ నిధులు రూ. 15లక్షలు మంజూరయ్యాయన్నారు. స్థలసేకరణ, రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే తప్ప స్థలాన్ని నిర్ధారించలేమని సర్పంచ్ రేగిడి రాంబాబు సభ్యులకు తెలిపారు. ఎరువులు, పురుగుల మందుల అమ్మకాలు చేపట్టాలని సభ్యులు కోరారు. ఎరువుల విషయంలో జిల్లా అధికారులు సొసైటీలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని రామచంద్రరావు చెప్పారు. ఈ సమావేశంలో సిఇఒ ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం గిజబ గ్రామంలోని లక్ష్మీ ఏజెన్సీ ఎరువుల దుకాణాన్ని సోమవారం వ్యవసాయశాఖ ఎడి ఎ.నిర్మలజ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని ఎరువులను తనిఖీలు చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమంగా ఎరువులు అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలో ఎరువుల షాపుల్లో వ్యవసాయ శాఖ ఎడి టి.వెంకటేష్ సోమవారం తనిఖీలు చేపట్టారు. రికార్డుల, నిల్వలు పరిశీలించారు. వివరాలు సరిగ్గా ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని యజమానులను ఎడి వెంకటేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఒ శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎడి నిర్మలజ్యోతి

ఆక్రమణపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని దావాలవీధి రామాలయం ఎదురుగా ఉన్న మున్సిపల్ స్థలం ఆక్రమణకు గురైందని, తక్షణమే అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి ఎస్.గోపాలం, స్థానికులు డిమాండ్ చేశారు. మున్సిపల్ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆర్‌డిఒ పి.శేషశైలజకు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దావాలవీధి రామాలయం ఎదురుగా ఉన్న రూ.1.50కోట్లు విలువ చేసే మున్సిపల్ స్థలాన్ని అక్రమించేస్తే మున్సిపల్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయ మన్నారు. తక్షణమే అధికార యంత్రాంగం స్పందించి ఆక్రమణలను తొలగించాలని, లేనిచో పోరాటం చేస్తామన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బాణాదికి చెందిన వై. ముత్యాలమ్మ (53)ను సోమవారం ట్రాక్టర్ ఢీ కొట్టడంతో మృతి చెందింది. ముత్యాలమ్మ కల్లం వద్ద నుంచి ఇంటికి నడిచి వెళుతుండగా గ్రామంలోని శివాలయం సమీపంలోని ఆతవ గ్రామానికి చెందిన నక్కల ఈశ్వరరావు ట్రాక్టర్ నడుపుతూ వెనుక భాగం నుండి ఆమెను ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముత్యాలమ్మను పోస్టుమార్టం నిమిత్తం ఎస్‌కోట తరలించినట్లు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలో తోటపల్లి జలాశయం వద్ద సోమవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. ఈ వ్యక్తి రాయగడకు చెందిన శ్రీనివాసమ్ అశోక్ కుమార్ (32)గా గుర్తించారు. ఈ నెల 20న వినాయక నిమజ్జనంలో భాగంగా నాగావళి నదిలో కుటుంబ సభ్యులతో కలిసి అశోక్ దిగాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి నదిలో కొట్టుకుపోయినట్లు ఎస్ఐకు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.